## హిందీ హక్కులు 200కోట్లు

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పుష్ప-2' (ది రూల్) చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొని ఉన్న విషయం తెలిసిందే. 'పుష్ప-ది రైజ్' పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించడంతో సీక్వెల్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆగస్ట్ 15న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కొద్ది రోజుల క్రితం బన్నీ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన టీజర్ సోషల్‌మీడియాలో రికార్డులు క్రియేట్ చేసింది. గంగమ్మ జాతరలో అమ్మవారి గెటప్‌లో అల్లు అర్జున్ పర్‌ఫార్మెన్స్ అందరినీ ఆకట్టుకుంది. టీజర్‌తో సినిమాపై మరింతగా అంచనాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో 'పుష్ప-2' హిందీ థియేట్రికల్ హక్కులను 200కోట్లకు కొనుగోలు చేశారని బాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడానీ ఈ సినిమా రైట్స్‌ను సొంతం చేసుకున్నారని సమాచారం.

## యాక్షన్ ఎమోషన్ రుస్లాన్

బాలీవుడ్ నటుడు ఆయుష్‌శర్మ హీరోగా నటిస్తున్న చిత్రం 'రుస్లాన్'. జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కరణ్.బి దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ నెల 26న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రాండ్ మీట్‌లో ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ అతిథిగా పాల్గొని చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఈ సినిమా చాలా స్పెషల్. అన్ని పాత్రలకూ ప్రాధాన్యత ఉంటుంది. ముఖ్యంగా ఆయుష్‌శర్మది ఎక్స్‌ట్రార్డినరీ కేరక్టర్. ఇందులో విభిన్నకోణాలున్న పాత్ర చేస్తున్నాను.' అని జగపతిబాబు చెప్పారు. అంకితభావం ఉన్న టీమ్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని, మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని హీరో ఆయుష్‌శర్మ తెలిపారు. ఎమోషన్, యాక్షన్‌తోపాటు మంచి సంభాషణలు, అందమైన విజువల్స్ ఇలా అన్ని ఎలిమెంట్స్‌తో గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని నిర్మాత రాధామోహన్ అన్నారు. ఇంకా చిత్ర కథానాయిక సుశ్రీ మిశ్రా కూడా మాట్లాడారు.

## కొత్త జంటతో సినిమా షురూ

నూతనతారలు టోనికిక్, సునీత మారస్యార్ జంటగా ఓ చిత్రం హైదరాబాద్‌లో లాంచనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కథారచయిత చిన్ని కృష్ణ క్లాప్ కొట్టగా, ఏఐ ఫ్లిక్స్ ప్రదీప్‌కుమార్ కెమెరా స్విచాన్ చేశారు. రచయిత వెలిగొండ శ్రీనివాస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అతిథులందరూ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. చిత్ర నిర్మాత గిరీశ్‌కుమార్ మాట్లాడుతూ 'మా ఏ3 లేబుల్స్ బ్యానర్‌లో ఇదే తొలి సినిమా. ఇక ముందు కూడా మంచి సినిమాలే చేస్తాం' అని నమ్మకం వ్యక్తం చేశారు. చిత్ర దర్శకుడు బుల్లెట్ బండి లక్ష్మణ్ మాట్లాడుతూ 'దర్శకుడ్ని కావడం నా కల. నా కలను గుర్తించి అవకాశం ఇచ్చిన నిర్మాతకు కృతజ్ఞతలు. ఇన్నాళ్లూ నాలుగు నిమిషాల పాటలో కథను చెప్పేవాడ్ని. ఇప్పుడు రెండు గంటల సినిమాతో చెప్పబోతున్నా. నన్ను యూట్యూబ్‌లో ఆదరించినట్టే, దర్శకుడిగా కూడా ఆదరిస్తారని నమ్మకంతో ఉన్నాను' అన్నారు. ఇంకా చిత్ర యూనిట్‌సభ్యులందరూ మాట్లాడారు.

## లచ్చిమక్క పెళ్లి సందడి

రాకేష్ వర్రె హీరోగా విరించి వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. ముదుగంటి క్రియేషన్స్ పతాకంపై ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకానుంది.1980కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం నుంచి 'లచ్చిమక్క' అనే పెళ్లిపాటను విడుదల చేశారు. గోపీసుందర్ స్వరపరచిన ఈ పాటను రాంబాబు గోసాల రచించారు. ఈ గీతాన్ని మంగ్లీ ఆలపించింది. పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం సరదాగా ఈ పాట సాగింది. 1980ల నాటి వాతావరణాన్ని ఆవిష్కరిస్తూ కన్నులపండువగా సాగింది. పొలిటికల్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వి.ఎస్.జ్ఞానశేఖర్, సంగీతం: గోపి సుందర్, దర్శకత్వం: విరించి వర్మ.

## బుట్టబొమ్మ కొత్త ప్రేమాయణం

మంగళూరు సోయగం పూజా హెగ్డే సరికొత్త ప్రేమాయణం ఇప్పుడు బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. హిందీ సీరియల్ నటుడు, బిగ్‌బాస్ సీజన్ 10 ఫేమ్ రోహన్ మెహ్రాతో ఈ అమ్మడు ప్రేమలో ఉందని ప్రచారం జరుగుతున్నది. గత కొంతకాలంగా పూజా హెగ్డే హాజరవుతున్న ప్రతి ప్రైవేట్ ఫంక్షన్స్‌లో రోహన్ మెహ్రా దర్శనమిస్తున్నాడు. ఇటీవల పూజా హెగ్డే తన కుటుంబ సభ్యులతో ఓ రెస్టారెంట్‌కు వెళ్లగా అక్కడ కూడా రోహన్ మెహ్రా కనిపించారు. పూజా ఫ్యామిలీ మెంబర్స్‌తో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చాడు. దీంతో ఈ భామ అతనితో డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. వారిద్దరి బంధానికి కుటుంబ సభ్యుల ఆమోదం ఉందని అంటున్నారు. ఆ కారణంగానే పూజా హెగ్డే కుటుంబ సభ్యులతో కూడా రోహన్ మెహ్రా సన్నిహితంగా ఉంటున్నాడని చెబుతున్నారు. అయితే వారిద్దరిలో ఎవరో ఒకరు స్పందిస్తేనే కానీ ఈ కొత్త ప్రేమకథలోని నిజానిజాలేమిటో తెలుస్తాయని అభిమానులు అనుకుంటున్నారు. గత రెండేళ్లుగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్నది పూజా హెగ్డే. ప్రస్తుతం ఈ భామ హిందీలో 'దేవా' అనే చిత్రంలో నటిస్తున్నది.



## తరుణ్‌భాస్కర్ కొత్త చిత్రం

దర్శకుడిగా, నటుడిగా తనదైన ప్రతిభను చాటుకుంటున్నారు తరుణ్‌భాస్కర్. తాజాగా ఆయన కథానాయకుడిగా ఓ సినిమా తెరకెక్కుతున్నది. సంజీవ్ ఏఆర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. తరుణ్‌భాస్కర్ సరసన ఈషారెబ్బా కథానాయికగా నటిస్తున్నది. ఈ చిత్రాన్ని శనివారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో తరుణ్‌భాస్కర్, ఈషారెబ్బా రూరల్ గెటప్‌లో ఆకట్టుకుంటున్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరుపుతున్నామని, అక్టోబర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. బ్రహ్మాజీ, శివన్నారాయణ, సురభి ప్రభావతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దీపక్, సంగీతం: జైక్రిష్, నిర్మాతలు: సృజన్ యరబోలు, వివేక్ కృష్ణని, సాధిక్, ఆదిత్య, దర్శకత్వం: సంజీవ్ ఆర్.

## ఇద్దరిలో ఎవరి పంతం నెగ్గింది?

ఎన్నికలను ప్రెస్టేజియస్‌గా తీసుకున్న ఓ రాజకీయనాయకుడు. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు పంచకుండా అడ్డుకుంటానని పంతం పట్టిన ఓ పోలీస్ అధికారి. ఎన్నికలకు పాతికరోజులే సమయం ఉంది. తక్కువ సమయంలో వందకోట్ల డబ్బుని, రెండు లక్షలమంది ఓటర్లకు, ఓటుకు 5000 చొప్పున పంచడం రాజకీయనాయకుడి టార్గెట్. మరి ఆ టార్గెట్‌ని రీచ్ అయ్యాడా? పోలీస్ అధికారి పంతం ఏమైంది? ఈ ప్రశ్నలకు సమాధానంగా తెరకెక్కుతున్న రాజకీయ వ్యంగ్యం చిత్రం 'లక్ష్మీకటాక్షం'. సాయికుమార్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో వినయ్, అరుణ్, దీప్తి వర్మ కీలక పాత్రధారులు. సూర్య దర్శకుడు. యు.శ్రీనివాసులరెడ్డి, బి.నాగేశ్వరరెడ్డి, వహీద్ షేక్, కె.పురుషోత్తంరెడ్డి నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ని విడుదల చేశారు. కథానుగుణంగా ఈ ట్రైలర్‌లో ఎన్నికల వేడిని చూపించారు. ప్రస్తుతం తెలుగురాష్ట్రాల్లో జరుగనున్న ఎన్నికల తేదీనే ఈ ట్రైలర్‌లోనూ చూపిస్తూ, పాతికేళ్ల కెరీర్ నిలబెట్టుకోవాలని తపించే రాజకీయవేత్తగా సాయికుమార్ కనిపించారు. ఈ ట్రైలర్‌లో కొన్ని ఫాంటసీ ఎలిమెంట్స్ కూడా ఉండటం గమనార్హం. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుందని దర్శక, నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేశారు. చరిష్మా శ్రీకర్, హరిప్రసాద్, సాయికిరణ్ ఏడిద, ఆమని తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: నని ఐనవెల్లి, సంగీతం: అభిషేక్ రుపున్.

## మధ్యతరగతి తండ్రి కథ

రాజారవీంద్ర ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడు. ఉమాదేవి, శరత్‌చంద్ర నిర్మాతలు. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి. మే నెలలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. హీరో శ్రీవిష్ణు టీజర్‌ని విడుదల చేసి చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. ఇది పక్కా కుటుంబకథా చిత్రమని టీజర్ చెప్పకనే చెబుతున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'ఓ మధ్య తరగతి తండ్రి కథ ఇది. భార్య, ఇద్దరు కొడుకులు, కూతురుతో సంసారాన్ని పరువుగా నెట్టుకొస్తున్న అతనికి తన బిడ్డలవల్లే ఇబ్బందులు ఎదురవుతాయి. సమాజం తనని నిలదీసే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. అప్పుడు ఆ తండ్రి ఏం చేశాడు?.. కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నాడు? అనే ప్రశ్నలకు సమాధానం ఈ సినిమా. మధ్య తరగతి ఎమోషన్సే ఈ సినిమాకు ప్రధాన బలం' అని చెప్పారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. శ్రీకాంత్ అయ్యంగార్, శివ చందు, యశస్విని, మొయిన్, మోహిత్, నీల, కాదంబరి కిరణ్, మాణిక్‌రెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ స్వయంభు, సంగీతం: ఎం.ఎ.బెనెజర్ పాల్.

## మూడు జీవితాల మనమే

శర్వానంద్ 35వ సినిమా 'మనమే'. కృతి శెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టీజర్‌ని బుధవారం మేకర్స్ విడుదల చేశారు. భిన్న మనస్తత్వాలు కలిగిన ఇద్దరు వ్యక్తుల ప్రయాణంలో తారసపడ్డ ఊహించని అతిథి కథ ఇదని టీజర్ ద్వారా చెప్పారు. జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించడానికి ఇష్టపడే ప్లేబాయ్‌గా ఇందులో శర్వా నటిస్తున్నాడని మేకర్స్ చెబుతున్నారు. కృతి శెట్టిది బాధ్యత గల అమ్మాయి పాత్ర అట. పిల్లాడు విక్రమ్ ఆదిత్య ఎంట్రీతో వీరిద్దరి జీవితం తలకిందులవుతుందనీ, మూడు పాత్రల మధ్య ఉన్న బంధాలను బయటపెట్టకుండా స్మార్ట్‌గా టీజర్‌ని కట్ చేయడం జరిగిందనీ, టీజర్‌లో ముగ్గురు పాత్రధారులూ చాలా అందంగా కనిపిస్తున్నారనీ నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్, విష్ణుశర్మ, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాణం: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.

## రెట్టింపు వినోదంతో 'మ్యాడ్ స్క్వేర్'

గత ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చిన 'మ్యాడ్' చిత్రం యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' తెరకెక్కనుంది. శుక్రవారం ఈ చిత్రాన్ని ఇటీవలే పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుగుతున్నది. మొదటి భాగంలో నటించిన యువహీరోలు నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్‌లు సీక్వెల్‌లో కూడా సందడి చేయబోతున్నారు. కథానాయికల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. 'సీక్వెల్‌లో రెట్టింపు మ్యాడ్‌నెస్ ఉంటుంది. ముగ్గురు మిత్రులు చేసే హంగామా నవ్వుల సునామీ సృష్టిస్తుంది' అని చిత్ర బృందం పేర్కొంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక, సాయిసౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ మరియు సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, దర్శకత్వం: కల్యాణ్‌శంకర్.

## భయపెట్టే బాక్

'అరణ్మనై' ఫ్రాంఛైజీ సిరీస్‌లో వస్తున్న నాలుగో చిత్రం 'బాక్'. స్వీయ దర్శకత్వంలో సుందర్ సి హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో తమన్నా, రాశీఖన్నా కథానాయికలు. తెలుగు, తమిళ భాషల్లో మే 3న ప్రేక్షకుల ముందుకురానుంది. తొలుత ఈ చిత్రాన్ని ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఎండల తీవ్రత దృష్ట్యా మే 3కి వాయిదా వేశామని మేకర్స్ తెలిపారు. 'హారర్ థ్రిల్లర్ కథాంశమిది. తమన్నా శివాని పాత్రలో కనిపిస్తుంది. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. వెన్నెల కిషోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఇ. కృష్ణమూర్తి, సంగీతం: హిప్‌హాప్ తమిళ, తెలుగు రిలీజ్: ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్, కథ, దర్శకత్వం: సుందర్ సి.